వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం: కలెక్టర్

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 15: చేతుల శుభ్రత వల్ల చాలా వ్యాధులను అరికట్టవచ్చని, అందరూ వ్యక్తిగత శుభ్రత పాటించి, ఆరోగ్యంగా జీవించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం చెల్పూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో యూనిసెఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్లోబల్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ పాటించడంతోపాటు ప్రభుత్వం అందజేసిన యూనిఫాం, షూస్ ధరించి, సమయానికి పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. పీఎం సిరీ కింద ఎంపికైన ఈ పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేశ్, యూనిసెఫ్ రాష్ట్ర ప్రతినిధులు కాశీనాథ్, ఫణీంద్ర, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో సునీత, హెచ్ఎం అనురాధ, యూనిసెఫ్ జిల్లా సమన్వయకర్త కిషన్ స్వామి, ఎంపీవో సతీశ్, ఎస్బీఎంలు రమేశ్, వేణు, ఏపీఎం తిరుపతి పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

కార్పొరేషన్, అక్టోబర్ 15: ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించి ఎల్ఆర్ఎస్‌ను పరిశీలించారు. అనంతరం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ ఆవరణలో ఏర్పాటు చేసే క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలుగకుండా దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ గురుకులాలపై స్పష్టత ఇవ్వాలి

కార్పొరేషన్, అక్టోబర్ 15: ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న రెసిడెన్షియల్స్ గురుకులాలు ఉంచుతున్నారో.. తీసివేస్తున్నారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకుడు జక్కుల నాగరాజు కోరారు. నగరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన గురుకులాలను కుదించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వాటినే పేరు మార్చుతున్నారో.. కొత్త స్కూల్స్ పెడుతున్నారో చెప్పాలన్నారు. సమావేశంలో సాయికృష్ణ, ప్రభాకర్, ప్రశాంత్, వేణు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీజే అబ్దుల్ కలాం జయంతి

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 15 : జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాలలో ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతిని కళాశాల ఫిజిక్స్ విభాగంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే రామకృష్ణ, వివిధ విభాగాధిపతులు పి. నితిన్, జ్యోతిలక్ష్మి, కిరణ్మయి, రాజేశ్, ఆంజనేయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కలాం విగ్రహావిష్కరణ

రాంనగర్, అక్టోబర్ 15 : మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా నగరంలోని అంబేద్కర్‌నగర్ చౌరస్తా వద్ద కలాం విగ్రహాన్ని ఆవిష్కరించారు. సామాజిక కార్యకర్త మహ్మద్ అమీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి మేన్నేని రోహిత్‌రావు హాజరై విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, కలాం దేశం గర్వించదగ్గ నాయకుడని, ఆయన ఆధ్వర్యంలో చేసిన అణు పరీక్షలు భారతదేశాన్ని ప్రపంచ అణ్వస్త్ర రాజ్యాల సరసన చేర్చాయని కొనియాడారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

సైదాపూర్, అక్టోబర్15: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 14వ విడుత సామాజిక తనిఖీలో భాగంగా ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించగా డీఆర్డీవో శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈజీఎస్‌లో భాగంగా సంవత్సర కాలంగా చేసిన ఈజీఎస్ పనులపై గ్రామాల వారీగా నివేదిక చదివి వినిపించారు. రూ. 61,338 అవకతవకలు జరిగినట్లు తేలడంతో సదరు మొత్తాన్ని సంబంధీకుల నుంచి రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ కృష్ణ, ఎంపీడీవో యాదగిరి, విజిలెన్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ మంజుల, స్టేట్ రిసోర్స్ పర్సన్ సాయిలు, ఎంపీవో బషీరొద్దీన్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

కొత్త ఉపాధ్యాయులకు పోస్టింగ్స్

- ఆఫ్‌లైన్ ద్వారా 215 మందికి పోస్టుల కేటాయింపు
- సాయంత్రం 4 గంటల తర్వాత ప్రారంభమైన ప్రక్రియ

నియామక పత్రాలు పరిశీలిస్తున్న అధికారి

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 15: జిల్లాలో డీఎస్సీ 2024 ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ఎట్టకేలకు పోస్టింగ్‌లు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం 4 గంటల తర్వాత జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రావు 215 మంది కొత్త ఉపాధ్యాయులకు ఆఫ్‌లైన్ ద్వారా పోస్టింగ్‌లు కేటాయించారు. అయితే, ఉదయం 9 గంటలకు అభ్యర్థులంతా హాజరవ్వాలని సోమవారం అధికారులు ప్రకటన విడుదల చేయగా, వారు ఉదయమే అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో కౌన్సెలింగ్ వాయిదా పడినట్లు డీఈవో కార్యాలయ అధికారులు తెలుపడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చి అభ్యర్థులు అయోమయానికి గురై వెనుదిరిగారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, అభ్యర్థులు కలెక్టరేట్ ఆడిటోరియానికి రావాలని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. కాగా, అప్పటికే వెనుదిరిగిన అభ్యర్థులు హుటాహుటిన తిరిగి అక్కడికి చేరుకుని కౌన్సెలింగ్‌కు హాజరవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఆఫ్‌లైన్ ద్వారా కొత్త టీచర్లకు పోస్టులను కేటాయించారు. అయితే, రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో వెకెన్సీ లిస్ట్ అప్‌డేట్ కాకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురయినట్లు అధికారులు తెలిపారు.

ఆడిటోరియం వద్ద గందరగోళం..

కౌన్సెలింగ్‌లో భాగంగా, కలెక్టరేట్ ఆడిటోరియం వద్దకు చేరుకున్న కొత్త ఉపాధ్యాయులకు గందరగోళ పరిస్థితులు ఎదురయ్యాయి. కౌన్సెలింగ్ హాల్ వద్ద విభాగాల వారీగా ఆడిటోరియంలోకి పిలిచారు. ఈ క్రమంలో ఒక మైక్ కూడా అందుబాటులో లేకపోవడంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. కొందరు అభ్యర్థులు రావడానికి సమయం పట్టడంతో వారి కోసం వేచి చూసి, వారు వచ్చిన తర్వాత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించారు.

ఆఫ్‌లైన్ ప్రక్రియతో ఇబ్బంది..

రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల ఖాళీల వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచగా, కౌన్సెలింగ్ మాత్రం ఆఫ్‌లైన్‌లో నిర్వహించారు. ఈ క్రమంలో అభ్యర్థులు కొంత మేర ఆందోళనకు గురయ్యారు. ఖాళీల వివరాలు చెప్పుకొంటూ, అభ్యర్థుల మెరిట్ వారీగా భర్తీ ప్రక్రియ సాగింది. అయితే, గతంలో ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా పారదర్శకంగా ఉపాధ్యాయుల కేటాయింపు జరుగగా, ఇప్పుడు కొన్ని పోస్టులను దాచి కేటాయింపులు చేస్తారనే భావన అభ్యర్థుల నుంచి వెలువడింది. ఈ విషయంలో కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. అయితే, పలు ఉపాధ్యాయ సంఘాలు ఆన్‌లైన్ ద్వారా కాకుండా, ఆఫ్‌లైన్ ద్వారానే పోస్టింగ్ ప్రక్రియ నిర్వహించాలని వినతి పత్రం ఇవ్వడంతోనే రాష్ట్ర వ్యాప్తంగా కౌన్సెలింగ్ ఆఫ్‌లైన్ ద్వారా నిర్వహించినట్లు తెలుస్తున్నది.

సంఘాల నాయకుల హడావుడి..

ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ హాల్ వద్ద పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకుల హడావుడి కనిపించింది. అయితే, ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ ఆఫ్‌లైన్ ద్వారా కొనసాగడంతో కొందరు అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. తమ వాళ్లకు కావాల్సిన అభ్యర్థుల స్థానాలను బ్లాక్ చేసి, మిగిలిన పోస్టులకు ఉద్యోగాలు కల్పిస్తారనే సతమతమయ్యారు. పలువురు అభ్యర్థులతో సంఘాల నాయకులు హాజరయ్యారనే గుసగుసలు వినిపించాయి. కానీ, అలాంటి వ్యవహారాలకు తావివ్వకుండా ఖాళీల వివరాలు డిస్‌ప్లే చేస్తూ మెరిట్ జాబితా ప్రకారం వాటిని కేటాయించగా, అభ్యర్థులు ఒకింత సంతృప్తి చెందారు.

ఆరు గ్యారెంటీలను విస్మరించిన సర్కారు

సతీశ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే

చిగురుమామిడి, అక్టోబర్ 15: ఆరు గ్యారెంటీల పేరిట అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు.. వాటి అమలును పూర్తిగా విస్మరించిందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పాటై పది నెలలు గడుస్తున్నా కేవలం ఉచిత ప్రయాణ సౌకర్యం తప్ప, ఇతర హామీల అమలు ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వరి కోతలు మొదలైనప్పటికీ పలు మండలాల్లో ఇంతవరకూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదని దుయ్యబట్టారు. బోనస్ హామీ బోగస్‌గా మారిందని, ఇది కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలకు నిలువెత్తు నిదర్శనమని దుయ్యబట్టారు. పది నెలల పాలనలో ముఖ్యమంత్రి రైతులు, రాష్ట్ర ప్రజలను పట్టించుకోలేదన్నారు. ఫలితంగా నేడు ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. రైతులందరికీ పంట పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ చేసేదాకా బీఆర్ఎస్ రైతుల పక్షాన పోరాడుతుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ప్రశ్నిస్తుందని, రైతులు, ప్రజలు అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు.

డిగ్రీ కళాశాలల సమస్యల పరిష్కారానికి కృషి

మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా. వీ నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా/హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 15 : పట్టభద్రులతోపాటు డిగ్రీ కళాశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కరీంనగర్‌లో పలు డిగ్రీ కళాశాలలను సందర్శించారు. అలాగే హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో వాకర్స్‌తో సమావేశమయ్యారు. ఆయా చోట్ల ఆయన మాట్లాడారు. కళాశాలలకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు మంజూరు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. తెలంగాణలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు ఉద్యోగ సాధనకు దోహదపడేలా ఒక ప్రత్యేక యాప్ రూపొందిస్తున్నామని, ఈ దీపావళి రోజు దానిని ప్రారంభించి అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలుపాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనకు కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

నిరుద్యోగుల గొంతుకగా నిలుస్తా

కార్పొరేషన్, అక్టోబర్ 15: తనను పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగుల గొంతుకగా నిలుస్తానని మాజీ మేయర్ రవీందర్‌సింగ్ అన్నారు. సోమవారం స్థానిక కరీంనగర్ కోర్టులో బార్ అసోసియేషన్ సభ్యులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే పట్టభద్రులు, నిరుద్యోగుల, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానన్నారు ప్రతి ఒక్క పట్టభద్రుడికి కేవలం ఒక్క రూపాయకే హెల్త్ ఇన్సూరెన్స్ చేయిస్తానని, ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఇది ఎంతో భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు. 2021 నవంబర్‌లోపు డిగ్రీ పూర్తి అయిన వారందరూ వచ్చే నెల ఆరులోగా పట్టభద్రుల ఓటరుగా నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలు రాజుకుమార్, మాజీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, న్యాయవాదులు అనిల్, తవుటు మురళి, పురెల్ల రాములు, విక్రం, సాదవేణి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అలవాట్లను మార్చుకుందాం.. ఆర్యోగ్యంగా జీవిద్దాం

మానకొండూర్, అక్టోబర్ 15: నిత్య జీవితంలో పొరపాట్లతో కూడిన అలవాట్లను మార్చుకుందామని.. సంపూర్ణ ఆరోగ్యంతో జీవిద్దామని యూనిసెఫ్ రాష్ట్ర ప్రతినిధులు కాశీనాథ్, ఫణీంద్ర పిలుపునిచ్చారు. ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులతో చేతుల పరిశుభ్రత పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రాజెక్ట్ సమన్వయకర్త రమేశ్, హెచ్ఎం శ్రీనివాస్, ఏపీవో కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రేవంత్‌రెడ్డి, ఎస్‌బీఎం వేణు, యూనిసెఫ్ సభ్యులు కళ్యాణి, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరానికి సీడీఎంఏ రాక

కార్పొరేషన్, అక్టోబర్ 15 : కరీంనగర్‌లో బుధవారం కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ గౌతమ్ పర్యటించనున్నారు. నగరంలోని డంప్‌యార్డు, కమాండ్ కంట్రోల్ సెంటర్, నగరంలో పారిశుధ్య పనుల తీరును పరిశీలించనున్నట్లు తెలుస్తున్నది. నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, స్మార్ట్ సిటీ పనుల తీరుపై ఇటీవల పాలకవర్గ సభ్యుల నుంచి ఫిర్యాదులు అందగా, వీటిపై ఇప్పటికే ఆర్డీఎంఏ విచారణ చేస్తున్న క్రమంలో సీడీఎంఏ నగరానికి పర్యటనకు రానుండడం ఆసక్తికరంగా మారింది. కాగా, కొందరు పాలకవర్గ సభ్యులు నగరపాలక సంస్థలో వివిధ అంశాలపై సీడీఎంఏకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది.

రూ.10 నాణెలపై అసత్య ప్రచారాలను నమ్మద్దు

రూ.10 నాణెలను వ్యాపారికి అందిస్తున్న బ్యాంకు ఉద్యోగి దామోదర్

విద్యానగర్, అక్టోబర్ 15 : రూ.10 కాయిన్లపై అసత్య ప్రచారాల నేపథ్యంలో యూనియన్ బ్యాంకు కరెన్సీ చెస్ట్ కరీంనగర్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది మాట్లాడుతూ, కొంతమంది తెలియక రూ.10 నాణెలు చెల్లుబాటులో లేవని, వాటిని స్వీకరించడం లేదన్నారు. ఆర్‌బీఐ రూ.10 నాణెలను రద్దు చేయలేదని. అవి చెలామణిలోనే ఉన్నాయన్నారు. యూనియన్ బ్యాంకుల్లో రూ.10 నాణెలను స్వీకరిస్తామని, ప్రజలు అపోహలు వీడి బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని కోరారు. వ్యాపారులకు రూ.10 నాణెలు అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో కరస్పాండెంట్ రాధాకృష్ణతో ప్రగతి హైస్కూల్ పూర్వ విద్యార్థులు

రామడుగు, అక్టోబర్15 : గోపాల్‌రావుపేట శుభం గార్డెన్స్‌లో స్థానిక ప్రగతి హైస్కూల్‌లో 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణ మాట్లాడుతూ, ప్రగతి పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారని చెప్పడానికి సంతోషిస్తున్నానని పేర్కొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు బాల్య మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు శ్రీనివాస్, తిరుపతి, అరుణ, సరస్వతి, నాగమణి, పూర్వ విద్యార్థులు మానుపాటి వెంకటేశ్, అనిల్, అరవింద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభంకాని కేంద్రాలు.. రోడ్లపైనే ధాన్యం రాశులు

పోలంపల్లి శివారులో రోడ్డుపైనే ఆరబోసిన ధాన్యం

తిమ్మాపూర్, అక్టోబర్ 15: గ్రామాల్లో వానకాలం పంట కోతలు ప్రారంభమైనా అధికారులు ఇంకా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం లేదు. మండలంలోని కేవలం రేణికుంట మినహా ఏ గ్రామంలోనూ సెంటర్ల ఊసే లేకుండా పోవడంతో కోతకు వచ్చిన పొలాలను రైతులు కోయించి, రోడ్డుపైనే ధాన్యం పోసి కల్లంగా మార్చుకుంటున్నారు. కాగా, రోడ్డుపై వడ్లు ఇలా పోయడం వల్ల గతంలో వాహన దారులు ప్రమాదాల బారిన సైతం పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సీపీఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి డిమాండ్ చేశారు.

బరువు పెరిగిన తనఖా ఆభరణాలు!

- గోల్డ్ లోన్ తీర్చే సమయంలో తూకం వేయగా బయటపడిన వ్యత్యాసం
- 15 గ్రాములు అధికంగా రావడంపై రుణ గ్రహీత అనుమానం

బ్యాంక్‌లో తూకం వేసిన ఆభరణాల వివరాలను పరిశీలిస్తున్న విజయ, ఆమె కుటుంబ సభ్యుడు

శంకరపట్నం, అక్టోబర్ 15: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో వింత ఘటన చోటు చేసుకుంది. ఓ మహిళ గోల్డ్ లోన్ తీసుకోగా అప్పు తీర్చే టైంలో తాము కుదువబెట్టిన ఆభరణాల కంటే ఎక్కువ బరువు రావడంతో అవాక్కయ్యారు. తాము ఇచ్చిన ఆభరణాల కంటే అధికంగా రావడంతో అనుమానం వ్యక్తం చేశారు. రుణ గ్రహిత కథనం ప్రకారం వివరాలు.. 2024 ఫిబ్రవరి 22న కొత్తగట్టు గ్రామానికి చెందిన కందుల విజయ మొలంగూర్‌లోని ఇండియన్ బ్యాంక్‌లో 114 గ్రాముల బంగారు ఆభరణాలు కుదువబెట్టి రూ.2 లక్షల 90 వేల రుణం తీసుకున్నారు. సోమవారం విజయ తన కుటుంబ సభ్యులతో కలిసి అప్పు తీర్చడానికి బ్యాంక్‌కు వెళ్లారు. బ్యాంక్ సిబ్బంది చెప్పిన ప్రకారం రుణం, వడ్డీ కలిపి రూ.2 లక్షల 95 వేలు చెల్లించారు. అనంతరం బ్యాంక్ సిబ్బంది ఆభరణాలు అప్పగించగా, అందులో గాజుల జత కనిపించలేదు. అంతేకాక తాము 114 గ్రాముల ఆభరణాలు తనఖా పెట్టగా, ఇప్పుడు 129 గ్రాములు అంటే 15 గ్రాములు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఆభరణాల బరువుపై విజయ, ఆమె కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయగా ఎక్కువ బరువు వస్తుందిగా తీసుకోమని మేనేజర్ చెప్పాడు. కాగా, అప్పటికే సాయంత్రం 4 గంటలు దాటడం, రుణ గ్రహీత అనుమానం నివృత్తి కాకపోవడంతో రేపు రమ్మని బ్యాంక్ అధికారులు సూచించారు. కాగా, తమ ఆభరణాలు నకిలీవేమోనని విజయ అనుమానం వ్యక్తం చేశారు. బుధవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

ఏవో విద్యానిధి దరఖాస్తు గడువు పొడిగింపు

కలెక్టరేట్, అక్టోబర్ 15 : అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం దరఖాస్తుల గడువు పొడిగించినట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు ఎం.నగైలేశ్వర్ తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 29 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో సూచించారు.

స్వీరోస్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

రామడుగు, అక్టోబర్ 15 : స్వీరోస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో జరిగే స్వీరోస్ నేషనల్ కన్వెన్షన్ వాల్ పోస్టర్లను మంగళవారం షానగర్‌లో స్వీరోస్ జిల్లా అధ్యక్షుడు పర్లపెల్లి మనోజ్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్వీరోస్ షానగర్ గ్రామాధ్యక్షుడు పర్లపెల్లి కిరణ్, గ్రామ మాజీ ఉప సర్పంచులు తోట రవి, గునుకొండ వెంకటనర్సయ్య, ప్రజాసంఘాల నాయకులు సయిండ్ల కరుణాకర్, చిరుత ఎల్లయ్య, పెంటి శంకర్, స్వీరోస్ నాయకులు వెంకటేశ్, గోపీచంద్, వినోద్ పాల్గొన్నారు.

నేడు పద్మశాలీ సంఘం విస్తృత స్థాయి సమావేశం

తెలంగాణచౌక్, అక్టోబర్ 15: నగరంలోని ఆర్టీసీ వర్క్‌షాపు ఎదుట గల పద్మశాలీ భవనంలో బుధవారం నిర్వహిస్తున్న తెలంగాణప్రాంత పద్మశాలీ సంఘం విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న కార్యవర్గ సమావేశంలో పద్మశాలీ నాయకుడు మచ్చ ప్రభాకర్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి పద్మశాలీ కులస్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు రేపు

కలెక్టరేట్, అక్టోబర్ 15 : మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ సహాయ సంచాలకులు ఎం.అనిల్ ప్రకాశ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో వాల్మీకి, బోయ కులబాంధవులతో పాటు ప్రజలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

వరి పంటకు గడ్డిమందు పిచికారీ

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 15: కందుగులలో ఓ రైతు వరి పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేయడంతో పంట దెబ్బతిన్నది. రైతు మహ్మద్ కరీం కథనం ప్రకారం.. కరీంకు గ్రామంలో 11 గుంటల వ్యవసాయ భూమి ఉండగా, అందులో వానకాలం వరి పంట వేశాడు. మరికొన్ని రోజుల్లో పంట చేతికి రానున్నది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారీ చేశారని, దీంతో తనకు సుమారు రూ. 20వేల వరకు నష్టం వాటిల్లిందని కరీం వాపోయాడు. రైతు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

గన్నేరువరం, అక్టోబర్15: ఖాసీంపేట గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు అయినట్లు ఏఎస్ఐ లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. శనివారం ఖాసీంపేట శివారులో తన మిత్రులు ముగ్గురితో కలిసి మూత్ర విసర్జన చేస్తుండగా, తమ పొలంలో మద్యం ఎందుకు తాగుతున్నారంటూ ఖాసీంపేట గ్రామానికి చెందిన కాట్నపల్లి చొక్కారెడ్డి, సాయిని తిరుపతి, కాట్నపెల్లి శశివర్ధన్ రెడ్డి, బద్దం విజయ్ రెడ్డితో పాటు మరికొందరు తమపై దాడి చేశారని సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం వడ్లూరు గ్రామానికి చెందిన మాదం రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

అక్కను కొడుతున్నాడని బావపై దాడి

- చికిత్స పొందుతూ మృతి

రాంనగర్, అక్టోబర్ 15: తాగిన మైకంలో భర్త తనను కొడుతూ వేధిస్తున్నాడని ఓ మహిళ సోదరుడికి చెప్పుకోగా అతడు బావపై దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన అతడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. నగరంలోని కట్టరాంపూర్ మహాలక్ష్మీనగర్‌కు చెందిన తమ్మనవేని ఆంజనేయులు (40) ఆటో నడుపుకొంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసై భార్య మంజులను కొడుతూ వేధించేవాడు. ఈ నెల 6న తాగిన మైకంలో భార్యను తీవ్రంగా కొట్టడంతో ఆమె తన సోదరుడు అనిల్ కుమార్‌కు ఫోన్ చేసి విషయం చెప్పింది. వెంటనే సోదరి ఇంటికి వచ్చిన అనిల్ ఎందుకు కొడుతున్నావు అని ఆంజనేయులుతో గొడవపడి దాడి చేశాడు. ఈ ఘటనలో ఆంజనేయులు తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానకు త